
లింగంపల్లిలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్


హుస్సేన్‌షావాలీ దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్


నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో జగదీశ్వర్‌గౌడ్ ప్రచారం

6 గ్యారంటీలు అమలు చేస్తాం

- శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్
- లింగంపల్లి, నల్లగండ్ల మార్కెట్‌లో ప్రచారం

శేరిలింగంపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను అందజేస్తుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. గురువారం లింగంపల్లిలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేసి ఓటు వేయాలని కోరారు. శేరిలింగంపల్లిలో ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు లింగంపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు.

నల్లగండ్ల మార్కెట్‌లో ప్రచారం...

నల్లగండ్ల మార్కెట్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ ప్రచారం చేశారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ గూటికి మాజీ కౌన్సిలర్ సునీత ప్రభాకర్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు సునీత ప్రభాకర్ రెడ్డి గురువారం కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రానున్నదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రజలంతా 6 గ్యారంటీలపై మాట్లాడుకుంటున్నారని అన్నారు.

గచ్చిబౌలి డివిజన్‌లో రోడ్‌షో..

రాయదుర్గం: శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్, పార్టీ నాయకుడు రఘునాథ్‌యాదవ్ భారీ రోడ్‌షో నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం నుంచి మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, ఎన్టీఆర్‌నగర్, గోపన్‌పల్లితండా , గోపన్‌పల్లి, వీకర్ సెక్షన్ వరకు రోడ్‌షో సాగింది. ఆయా ప్రాంతాలలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. పలుచోట్ల మహిళలు మంగళహారతులు ఇస్తూ ఆయనకు స్వాగతం పలికారు.

విజయం ఖాయం

గచ్చిబౌలి డివిజన్‌లో రోడ్‌షో సందర్భంగా ఆయన రఘునాథ్‌యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు, సుధాకర్‌గౌడ్, రవిగౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, ప్రార్థనలు

రాయదుర్గంలోని హుస్సేన్‌షావాలీ దర్గాలో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా పూజలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాయదుర్గంలో రోడ్‌షోలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ ఇచ్చిన పార్టీ

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియా గాంధీకి కానుకగా ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.


రాయదుర్గం నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్‌షోలో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించండి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ రామకృష్ణ వీధిలో గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీ సతీమణి అరెకపూడి శ్యామలాదేవి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెకపూడి గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, అరెకపూడి ప్రణీత, రంగారావు, భాస్కర్‌రావు, సంజీవరెడ్డి, పురేందర్ రెడ్డి, తాండవ కృష్ణ, కార్తీక్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటెయ్యండి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ తరఫున కార్పొరేటర్ మంజుల గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని మాధవ్ బృందావన్, గిరిజా మార్వెల్ అపార్ట్‌మెంట్స్‌లలో పార్టీ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.


హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో.. గజమాలతో గాంధీకి స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

సాయినగర్ వెస్ట్‌లో

ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం సాయినగర్ వెస్ట్‌లో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలతో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌యస్ పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతున్నామన్నారు .నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్ పరిధిలో..

మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని టీఎన్‌నగర్ కాలనీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ గెలుపు కొరకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ,పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ...అభివృద్ధికి పాటుపడే గాంధీకే మరోమారు ఓటువేసి గెలిపించాలని కోరారు.


రామకృష్ణవీధిలో ప్రచారంలో పాల్గొన్న గాంధీ కుటుంబ సభ్యులు, రోజాదేవి రంగారావు, నాయకులు, కార్యకర్తలు

గజమాలతో స్వాగతం.

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజలు మంగళ హారతులతో నీరాజనం పలుకుతున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, ప్రకాశ్‌నగర్ కాలనీలలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మ్యానిఫెస్టోలోని అంశాలతో బాటు మెట్రో రైల్ శేరిలింగంపల్లి నియోజకవర్గం మొత్తం విస్తరించబోతుందన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

మాదాపూర్: మాదాపూర్‌లో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వేల కోట్ల రూపాయల నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అభివృద్ధి చేశామని తెలిపారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.


ఆల్విన్ కాలనీలో .. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు


గాంధీని అభినందిస్తున్న కాలనీవాసులు


గాంధీపై పూల వర్షం


చందానగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

సుపరిపాలన అందించే బీజేపీకే ఓటు వేయండి


కార్యకర్తల భారీ ర్యాలీ

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్

మియాపూర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటేనని.. ఓటు వృథా చేసుకోవద్దని, అభివృద్ధి, భవిష్యత్తు, మంచి పాలనను అందించే బీజేపీకే ఓటువేసి మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మియాపూర్ డివిజన్, మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడిపారు..

నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కుమార్

ఆల్విన్‌కాలనీ: ఎన్నికల్లో కేవలం మద్యం, డబ్బుతో బీఆర్‌యస్, కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావాలని చూస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కుమార్ ఎద్దేవా చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ ఎల్లమ్మబండ చౌరస్తా, పీజేఆర్‌నగర్ చౌరస్తాలలో ఆయన బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభ్యర్థి రవికుమార్‌యాదవ్‌కు మద్దతుగా గురువారం రోడ్ షో నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్ యాదవ్‌ని భారీ మెజార్టీ గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ కేసీఆర్ హామీలతో 9 సంవత్సరాలు ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడిపారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టో హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదిమంది సీఎం అభ్యర్థులు ఉన్నారని వారు కుర్చీల కోసం పాకులాడటంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మేలు చేయాలన్న తపన ఉండదన్నారు. జోరు వర్షంలో కూడా పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్, రవీందర్‌రావు, చారి, కుమార్‌యాదవ్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.









ఎల్లమ్మబండలో రోడ్ షోలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కుమార్, బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ తదితరులు

ఆర్ట్‌గ్యాలరీలో ఇండియన్ ఫొటో ఫెస్టివల్





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 40 దేశాల నుంచి 2500 మంది ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. జనవరి 7 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సంతాప సభ

రాయదుర్గం: మనూ యూనివర్సిటీ కోల్‌కతా రీజనల్ సెంటర్ డైరెక్టర్ డా.ఇమామ్ ఆజమ్ గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోనా పరిపాలనా భవనంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి డాక్టర్ ఇమామ్ ఆజమ్ విలువైన సేవలను అందించారని గుర్తు చేశారు. అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామం ఆంపీ థియేటర్‌లో శుక్రవారం నుంచి మూడురోజులపాటు భరతవేద ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధేంద్ర యోగి ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించనున్నారు. గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందం పాల్గొనుంది.

కాలుష్య కాసారాలు..

- మురుగునీరు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో చెరువులు


గుర్రపుడెక్క, మురుగునీటితో నిండిన చెరువులు

మియాపూర్: చెరువులు, కుంటలు కాలుష్య కాసారాలుగా మారాయి. చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదు. నిండు కుండలా ఉండాల్సిన చెరువులు, కుంటలు గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, మురుగు నీటితో నిండిపోయాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. మియాపూర్ డివిజన పరిధిలో చెరువుల సుందరీకరణకు లక్షలాది రూపాయలు కేటాయించినా కనీసం 25 శాతం పనులు కూడా పూర్తికాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. హడావిడిగా శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించి తాత్కాలికంగా చెరువు కట్టలను పూడ్చి వదిలేశారు.

- డివిజన్ పరిధిలో నాయినమ్మకుంట, రామసముద్రం కుంట, రేగుల కుంట, పటేల్ చెరువు, మక్త చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు.
- పటేల్ చెరువును రూ.12 కోట్లతో, రేగులకుంట చెరువు రూ.80 లక్షలు, నాయినమ్మ కుంట చెరువు రూ.1.25 కోట్లతో, మీదికుంట చెరువు, మక్త చెరువులకు రూ.2.13 కోట్లు, రామసముద్రం చెరువుకు రూ.కోటి రూపాయలు కేటాయించారు.
- పటేల్ చెరువుకు నిధులు కేటాయించి ఐదేళ్లు గడుస్తున్నాయి. ఐదేళ్ల క్రితం చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు చెరువుచుట్టు కట్ట మాత్రం ఏర్పాటు చేశారు. మురుగు మళ్లించేందుకు కొంత మేర పైపులైన్లు వేసి వదిలేశారు.
- మిగతా చెరువులకు చుట్టు మట్టి పోసి వదిలేశారు. చెరువులు, కుంటలు అభివృద్ధి పేరుతో నీటిని తోడేశారు. దీంతో చెరువులలో చుక్క నీరు కూడా లేదు.
- చెరువుల చుట్టుపక్కల ప్రాంతవాసులు దుర్గంధం భరించలేక దోమల బెడదతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గత ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్న విషయం మళ్లీ ఎన్నికలు వచ్చినా తీర్చకపోవడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బీఆర్‌ఎస్‌తోనే యువత ఉపాధి

- మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌తోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అమీన్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ సపనదేవ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డితో కలిసి గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణకు మరో రాష్ట్రం సాటిరాదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నర్ర భిక్షపతి, బాబుల్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారం..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపోలో గురువారం సికింద్రాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, రీజన్ మేనేజర్ ఖుస్రు సో ఆలీఖాన్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొని 11 డిపోల పరిధిలోని ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టీసీ డ్రైవర్స్ ప్రశాంతంగా ఉండాలని, ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చే బాధ్యత డ్రైవర్‌పై ఉంటుందన్నారు. మంచి కేఎంపీఎల్ తీసుకువచ్చి డిపోలను అభివృద్ధి బాటలో నడపాలని కోరారు.